7

సాక్షి
మంచిర్యాల

మంగళవారం । 14 । జనవరి । 2025


పాత మంచిర్యాలలో ముగ్గు వేస్తున్న మహిళ


మంచిర్యాలటౌన్: జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో భోగిమంటలు


చెన్నూర్‌రూరల్: అస్నాద్‌లో చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న మహిళలు

సందడే సందడి

- అంబరాన్నంటిన భోగి వేడుకలు
- నేలతల్లి మెరిసే.. ముగ్గులతో మురిసే

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో సోమవారం తెల్లవారు జాము నుంచే ఊరూరా.. వాడవాడల్లో భోగి సందడి నెలకొంది. ఏడాదంతా సుఖసంతోషాలతో ఉండాలని, నవధాన్యాలు, సిరిసంపదలు కలగాలని కోరుకుంటూ భోగిమంటలు వేశారు. కొత్తకాలానికి స్వాగతం పలుకుతూ భోగిమంటలు చుట్టూ చిన్నాపెద్ద కేరింతలు కొడుతూ నృత్యం చేశారు. భోగిపండ్ల ఉత్సవం, భోగిమంటలు, బొమ్మల కొలువులతో కళకళలాడాయి. ఆకాశంలో ఎగిరే గాలిపటాలు, ఇంటిముందర గొబ్బెమ్మలు, ముగ్గులు కనువిందు చేశాయి. కట్టూబొట్టు సంస్కృతిని గుర్తు చేశాయి. భోగిమంటలతో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, లక్సెట్టిపేట, మందమర్రి పట్టణాల్లోని మార్కెట్లలో పతంగుల కొనుగోలు, ముగ్గుల రంగులు, పూజసామగ్రి కొనుగోళ్లతో సందడి నెలకొంది. చిన్నారులు పతంగులు ఎగురవేసి సంబరాల్లో మునిగితేలారు.


హాజీపూర్: భోగిపండ్లు పోసి హారతి


ఆదిత్య ఎన్‌క్లేవ్ భోగి మంటల వద్ద ప్రజలు


మంచిర్యాలలో పతంగుల విక్రయాలు


మంచిర్యాలలోని సున్నంబట్టి ఏరియాలో..

కమనీయం.. రమణీయం..


దేవతామూర్తులను దర్శించుకుంటున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, సురేఖ

- వైభవంగా గోదారంగనాథస్వామి కల్యాణం
- భారీ సంఖ్యలో హాజరైన భక్తులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/మంచిర్యాలఅర్బన్: ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా సోమవారం గోదారంగనాథుల కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీసు బెటాలియన్ ఎదుట ఉన్న గోవింద క్షేత్రంలో భోగి పండుగ సందర్భంగా అశేష భక్తజన వాహిని మధ్య గోదారంగనాథుల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ పి.వెంకటరాములు దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. భద్రాచలం నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన వేదపండితులు చక్రధరాచార్యులు, ఆలయ అర్చకులు నర్సింహాచార్యులు, ప్రమోద్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల మధ్య కల్యాణం జరిపించారు. బెటాలియన్ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు, జైశ్రీమన్నారాయణ భక్తులు, గుడిపేట పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణాన్ని తిలకించారు. మంచిర్యాలలోని విశ్వనాథ ఆలయంలో గోదారంగనాథస్వామి కల్యాణం సోమవారం రాత్రి రమణీయంగా సాగింది. గోదాదేవి, రంగనాథస్వామి ఉత్సవ మూర్తులతో ఆలయ ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన స్వామి కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణ వేడుకలకు మంత్రి సీతక్క, ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ తదితరులు హాజరయ్యారు. కాసేపు కల్యాణ వేడుకలను తిలకించి దేవతామూర్తులను దర్శించుకున్నారు. అంతకుముందు మంత్రి సీతక్కకు ఆలయ ఈవో ముక్తా రవి, అర్చకులు ఘన స్వాగతం పలికారు. కల్యాణోత్సవ కార్యక్రమంలో అర్చకులు భట్రాచార్య, బాలక్రిష్ణశర్మ, నరహరిశర్మ, మాజీ ఎమ్మెల్యేదివాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


గుడిపేటలో గోదారంగనాథుల కల్యాణం


గుడిపేటలో గోదారంగనాథుల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

న్యూస్‌రీల్

ఘనంగా పుష్యపౌర్ణమి జాతర


కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

దండేపల్లి: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం పుష్యపౌర్ణమి జాతర ఘనంగా నిర్వహించారు. జిల్లాతోపాటు పక్క జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవుణ్ని దర్శించుకున్నారు. పలువురు దంపతులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం గోదారంగనాథుల స్వామి కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్వారీలో జంగల్ సఫారీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గఢ్‌పూర్ గ్రామ పరిధిలోని ఎంసీసీ క్వారీ అడవిలో 14న గాంధారీ ఖిల్లా జంగల్ సఫారీని ప్రారంభించనున్నట్లు లక్సెట్టిపేట అటవీ రేంజ్ అధికారి అత్తె సుభాశ్ తెలిపారు. కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్ట్ పరిధి పాతమంచిర్యాల అటవీ బీట్ పరిధిలో ఏర్పాటు చేసిన గాంధారీ ఖిల్లా జంగల్ సఫారీని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ప్రారంభిస్తారని తెలిపారు. 25 కిలోమీటర్ల సఫారీలో మధ్యలో ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్లు, మంచెలు, వాచ్ టవర్లు, నీటికుంటలు, చారిత్రాత్మక ప్రాంతమైన గాంధారీ ఖిల్లా, దట్టమైన అడవులు, పలు రకాల జంతువులు, అటవీ అందాలు పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచనున్నాయని తెలిపారు. కవ్వాల్ టైగర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం, జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, జిల్లా అటవీ అభివృద్ధి అధికారి సర్వేశ్వర్ హాజరవుతారని పేర్కొన్నారు.

16 నుంచి పత్తి రైతుల తాత్కాలిక రిజిస్ట్రేషన్

చెన్నూర్: చెన్నూర్ మార్కెట్ యార్డులో ఈ నెల 16 నుంచి పత్తి రైతుల తాత్కాలిక రిజిస్ట్రేషన్ ప్రారంభించనున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. అనధికారిక పత్తి విక్రయాల నివారణకు తాత్కాలిక రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు తప్పనిసరిగా గుర్తింపు సంఖ్య కలిగిన ఏఈవో సంతకంతో ఉన్న మాన్యువల్ సర్టిఫికేట్ తీసుకు రావాలని సూచించారు. ఆధార్ బయోమెట్రిక్ ధ్రువీకరణ పత్రం, పత్తి రవాణా వాహనాన్ని తీసుకు రావాలని తెలిపారు. టీఆర్ ధ్రువీకరణ పత్రంతో ఇతర జిల్లాల్లో పత్తి అమ్మకం నిషేధమని తెలిపారు. జిల్లాలో తీసుకున్న తాత్కాలిక ధ్రువీకరణ పత్రం మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. 40 క్వింటాళ్లకు పైగా పత్తి అమ్మకాల కోసం సరైన పత్రాలు సమర్పిస్తేనే అనుమతిస్తామని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో డైరెక్ట్ డేటా ఉన్న రైతులు నేరుగా మిల్లులకు వెళ్లి సీసీఐకి పత్తి అమ్ముకోవచ్చని తెలిపారు.

పథకాల పండుగ

- సంక్రాంతి తర్వాత మూడు అమలు
- ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా
- కొత్త రేషన్‌కార్డుల జారీకి కార్యాచరణ సిద్ధం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సంక్రాంతి పండుగ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జారీ ప్రారంభం కానుంది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ప్రజాపాలన దరఖాస్తులు, కుటుంబ సర్వేలో ప్రజలు పేర్కొన్న వివరాల ఆధారంగా ఇంటింటి సర్వే పూర్తయింది. అర్హులను గుర్తించేందుకు ఉమ్మడి జిల్లాలో అధికారులు ప్రతీ గడపకు వెళ్లి వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేశారు. అక్కడక్కడ సమస్యలు ఉన్నా పరిష్కరిస్తున్నారు. ఈ క్రమంలో సంక్రాంతి పండుగ తర్వాత ఉమ్మడి జిల్లాలో సంక్షేమ పథకాల పండుగ మొదలు కానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాల కలెక్టర్లకు అంతా సక్రమంగా సాగేలా దిశానిర్దేశం చేసింది. పథకాల ఎంపికకు కీలకంగా మారిన గ్రామసభల్లో ఈ నెల 24లోపు అర్హులను గుర్తించాల్సి ఉంది. పండుగ తర్వాత అధికార యంత్రాంగం పథకాల అమలుపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనుంది.

మరోవైపు ఈ నెల 26 తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటన చేస్తానని ప్రకటించడంతో ఉమ్మడి జిల్లా అధికారులు అప్రమత్తం అయ్యారు.

ఇందిరమ్మ ఇళ్లు

గూడు లేని నిరుపేదలకు ఇళ్లు అందించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేయనున్నారు. ఇప్పటికే సర్వే పూర్తి కాగా, అర్హులను ప్రకటించాల్సి ఉంది. ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఉమ్మడి జిల్లా పరిధిలో గిరిజన ప్రాంతాలతో సహా గ్రామ, పట్టణాల్లో నిర్వహించే సభల్లోనే అర్హులను ఎంపిక చేయనున్నారు.

తగ్గనున్న రైతు భరోసా

ఈ నెల 16నుంచి రైతుభరోసా కోసం సాగు సర్వే మొదలు కానుంది. నాలుగు రోజుల్లో అంటే 20వరకు సర్వే పూర్తి చేసి సాగు భూముల లెక్క తేల్చాలి ఉంది. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు చేపట్టే ఈ సర్వేలో పట్టాభూములుగా ఉండి, సాగులో ఉన్నట్లు ధ్రువీకరిస్తేనే రైతు భరోసా కింద పెట్టుబడి సాయం ఎకరానికి రూ.12వేల చొప్పున అందనుంది. ఉమ్మడి జిల్లాలో చాలా భూములు రియల్ వెంచర్లుగా మారిపోయాయి. మరికొన్ని చోట్ల రోడ్లు, వ్యాపార కార్యక్రమాల కోసం వినియోగిస్తున్నారు. కొన్నిచోట్ల ఇంకా రెవెన్యూ రికార్డుల్లో సాగు భూములుగానే కొనసాగుతున్నాయి. వీటిపైన సమగ్రంగా సర్వేచేసి లబ్ధిదారులను తేల్చనున్నారు. గతంలో గుట్టలు, అటవీ భూములు, రోడ్లు, వెంచర్లు, వాగులు, వంకల్లో ఉన్న భూములు, పట్టణ శివార్లలో ఇళ్ల స్థలాలకు సైతం పెట్టుబడి సాయం అందింది. తాజా సర్వేతో గత ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధు కంటే భరోసా లబ్ధిదారులు తగ్గే అవకాశం ఉంది.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు

కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారికి భారీ ఊరట కలుగనుంది. పాత విధానంలోనే కొత్త రేషన్ కార్డులు జారీ చేసే అవకాశం ఉంది. ఇప్పటికే వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. పెళ్లయిన వారు, చిన్న పిల్లల పేర్ల మార్పులు, చేర్పులు, కుటుంబాల నుంచి వేర్వేరుగా ఉన్న వారికి రేషన్ కార్డుల అవసరం ఏర్పడుతోంది. ప్రస్తుతం పథకాలు రేషన్‌కార్డుల ఆధారంగానే ఎంపిక చేస్తున్న తరుణంలో కార్డుల కోసం అనేక మంది ఎదురు చూస్తున్నారు. ఇక భూమి లేని వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ.12వేల సాయం అందనుంది. ఇందుకు ఉపాధిహామీ పథకంలో కనీసం 20రోజులు పని దినాలు చేసినట్లు నమోదై ఉన్నవారికి అవకాశం కల్పిస్తారు.

తర్వాత 'స్థానిక'ం

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో కీలకమైన ఈ మూడు సంక్షేమ పథకాల అమలు మొదలైన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ మేరకు ఇప్పటికే పోలింగ్ కేంద్రాలు, వార్డులు, ఓటర్ల మార్పులు, చేర్పులతో తుది జాబితా వెలువడింది. నాయకులు సైతం ఎన్నికల కోసం సన్నద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలో పథకాల అమలు జరిగాక పంచాయతీ, మండల, జెడ్పీ, ఆ తర్వాత పట్టణ పరిధిలో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అన్నింటికంటే ముఖ్యమైనవి కళ్లు


అద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్ సతీమణి రమ

నెన్నెల: శరీర అవయవాల్లో అన్నింటికంటే ముఖ్యమైనవి కళ్లు అని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం మండలంలోని గంగారాం ప్రజలకు ఆయన సతీమణి రమతో కలిసి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల క్రితం బెల్లంపల్లిలో తన కూతురు డాక్టర్ వర్ష ఆధ్వర్యంలో మండల ప్రజల కోసం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కంటి సమస్యలు ఉన్న వారికి ఇప్పుడు అద్దాలు అందజేస్తున్నట్లు చెప్పారు. గ్రామాలను విద్య, వైద్యం, రవాణా, వ్యవసాయ రంగాల్లో ముందుకు తీసుకెళ్తానన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గట్టు మల్లేష్, తోట శ్రీనివాస్, జాడి రాజ్‌కుమార్, కామెర సుధా, మల్లాగౌడ్, శ్రీనివాస్, కొమ్ము రాజన్న, జలీల్, శ్రీమతిదేవి, మల్లీక, ఏస్కూరి లక్ష్మణ్,దేవేందర్, గట్టు బానేష్ పాల్గొన్నారు.

జూన్‌లోపు రోడ్డు విస్తరణ పనులు

- విస్తరణ ప్రణాళికకు సీఎం అభినందన
- ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని మార్కెట్ రోడ్డు విస్తరణ పనులన్నీ జూన్‌లోపు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. సోమవారం విస్తరణ పనుల్లో భాగంగా రోడ్లపైకి వచ్చిన ఆక్రమణల తొలగింపును ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పట్టణంలోని వ్యాపార ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ, భూగర్భ మురికి కాలువ ప్రణాళికను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారని అన్నారు. భూగర్భ మురికి కాలువలు, కేబుల్ వ్యవస్థకు సంబంధించి తెలుసుకుని రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో ఇదే ప్రణాళికను అమలు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారని చెప్పారు. మార్కెట్ రోడ్డు, మెయిన్ రోడ్డు, శ్రీనివాస్ థియేటర్ రోడ్డు, వాటర్ ట్యాంక్ రోడ్లను విస్తరించడంతోపాటు భూగర్భ మురికి కాలువలు, ఫుట్‌పాత్ నిర్మాణం చేపడతామని అన్నారు. ఫిబ్రవరిలో పనులు చేపట్టి వర్షాకాలానికి ముందే నిర్మాణాలను పూర్తి చేసి భరోసా ఇచ్చారు. తాను 30 ఏళ్లకు సరిపడా అభివృద్ధిని చేస్తున్నానని, ఎవరూ ఆటంకం కల్పించవద్దని, సహకరించాలని కోరారు. నియోజకవర్గ ప్రజలందరూ సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.


మహాప్రస్థానం పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పనులు వేగవంతం చేయాలి

మంచిర్యాల పట్టణంలోని గోదావరి తీరాన మహాప్రస్థానం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, శివరాత్రిలోపు పనులన్నీ పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం మహాప్రస్థానం పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు.

క్లర్క్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

- ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య


మాట్లాడుతున్న ముస్కే సమ్మయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో క్లర్కుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ సెంట్రల్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య తెలిపారు. సోమవారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో క్లరికల్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లర్క్‌లు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, సబ్ కమిటీ ఆధ్వర్యంలో అందరినీ ఐక్యం చేసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని అన్నారు. సమస్యలపై నేరుగా యాజమాన్యంతో చర్చించేందుకు ఫిట్ లెవల్, డివిజన్ లెవల్, సెంట్రల్ లెవల్ కమిటీలో ప్రాతినిధ్యం కల్పిస్తున్నామని అన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న క్లర్కుల క్యాడర్ స్కీం, ప్రమోషన్ పాలసీ, హక్కులు, ఇతర సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఓసీపీ క్లరికల్ ఫిట్ సెక్రెటరీగా కట్ల రమేష్, అసిస్టెంట్ సెక్రెటరీగా సుకన్యను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో యూనియన్ జీఎం చర్చల కమిటీ ప్రతినిధి బద్రి బుచ్చయ్య, సీహెచ్‌పీ క్లరికల్ ఫిట్ కార్యదర్శి జిల్లాల రవి, యూనియన్ ఫిట్ సెక్రెటరీ మోత లచ్చన్న, క్లరికల్ సిబ్బంది సరోజ, బానేష్, కృష్ణ పాల్గొన్నారు.

తెలంగాణ సమరయోధులకు పింఛన్ ఇవ్వాలి


మాట్లాడుతున్న స్వరాష్ట్ర సమరయోధులు

బెల్లంపల్లి: స్వరాష్ట్రం కోసం పోరాడిన తమకు రాష్ట్ర ప్రభుత్వం సమరయోధుల పింఛన్ మంజూరు చేయాలని బెల్లంపల్లికి చెందిన తెలంగాణ తొలితరం స్వరాష్ట్ర సమరయోధులు కోరారు. సోమవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని తొలిదశ ఉద్యమంలో ప్రాణాలకు తెగించి పోరాడామని, ఎందరో లాఠీ దెబ్బలు తిన్నారని, జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. తొలితరం ఉద్యమకారుల్లో ఇప్పటికే అనేకమంది మృతిచెందారని తెలిపారు. స్వరాష్ట్ర సాధనలో భాగస్వాములైన సమరయోధులకు పింఛన్, ప్రభుత్వ రాయితీలు అమలు చేయాలని గతేడాది డిసెంబర్ 27న హైకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. హైకోర్టు తీర్పును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ సమరయోధులు ఎం.సత్యనారాయణ, జంజిరాల రాజం, జాగటి బాపు, జహంగీర్ పాషా, గోసిక లక్ష్మీ, పంగ బొంద్యాలు, తోకల లింగయ్య, జెరిపోతుల మొగిలి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల వినూత్న నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

బెల్లంపల్లి: పెండింగ్ వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆసుపత్రి ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి చెట్ల ఆకులు తింటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ గత ఐదు నెలుగా వేతనాలు చెల్లించడం లేదని, పీఎఫ్ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ చేయకపోవడం దారుణమని తెలిపారు. ప్రతీ నెల మొదటివారంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధమైన హక్కులు, ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు చెల్లించకుండా వేధింపులకు గురిచేస్తున్న కాంట్రాక్ట్ సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 20న చలో కలెక్టరేట్ చేపడతామని తెలిపారు. ఏరియా ఆసుపత్రి వైద్యులకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్.రవి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణ, రంజిత్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి దూలం శ్రీనివాస్, సీఐటీయూ బెల్లంపల్లి మండల కన్వీనర్ సీహెచ్.దేవదాస్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కుక్కల దాడిలో గొర్రె మృతి

బోథ్: మండలంలోని ధన్నూర్(బి)లో షేక్ పెద్ద మోహినుద్దీన్‌కు చెందిన గొర్రెపై సోమవారం కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. గొర్రె విలువ రూ.12 వేల వరకు ఉంటుందని, తనకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఈ నెల 10న అదృశ్యమైన పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బోంపల్లి నరేందర్ (30) మృతదేహం సోమవారం లభ్యమైనట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈనెల 9న ఇంటి నుంచి బయలుదేరిన నరేందర్ ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ ప్రాంతంలో అతని తండ్రికి కనిపించాడు. మరుసటి రోజు నుంచి కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. జైనథ్ మండలంలోని పెన్‌గంగలో శవమై తేలినట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

మీ పోలీస్ పనితీరు ఎలా ఉంది?

- పోలీసుల్లో మార్పు తెచ్చేందుకే వినూత్న ప్రయత్నం
- అధికారులు, సిబ్బంది పనితీరుపై ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ
- ఐదు అంశాలపై..
- పోలీసు స్టేషన్‌లలో సిటిజన్ ఫీడ్ బ్యాక్ క్యూఆర్ కోడ్ ఏర్పాటు

ఆదిలాబాద్‌టౌన్/మంచిర్యాలక్రైం: పోలీసులు, పోలీసు స్టేషన్‌ల పనితీరుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. పోలీసు స్టేషన్‌లకు వచ్చేవారితో సిబ్బంది, అధికారులు ప్రదర్శిస్తున్న తీరుపై ఆరా తీసేందుకు చర్యలు చేపట్టింది. ఐదు అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతోంది. సిటిజన్ ఫీడ్ బ్యాక్ క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసింది. ఆన్‌లైన్‌లో బాధితులు, జనాలు పోలీసుల పనితీరుపై అభిప్రాయం తెలియజేయవచ్చు. పోలీసు స్టేషన్‌లలో వేచి ఉండే గది, ప్రజలకు కల్పిస్తున్న సేవలు, సమస్య పరిష్కారమైందా.. లేదా తదితర అంశాల గురించి వివరించేందుకు అవకాశం కల్పించింది. ఇదివరకు డీజీపీ కార్యాలయం నుంచి ఫిర్యాదుదారులకు ఫోన్ చేసి సమాచారం అడిగేవారు. సమస్య పరిష్కారం అయ్యిందా.. లేదా, సిబ్బంది తీరు ఎలా ఉంది.. తదితర విషయాలపై ఆరా తీసేవారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి పోలీసు స్టేషన్, పోలీసుల పనితీరుపై మనం ఫీడ్‌బ్యాక్ ఇచ్చే అవకాశం ఉంది. పోలీసు అధికారులు జిల్లాలోని ఆయా పోలీసు స్టేషన్‌లలో



ఆదిలాబాద్ పోలీసు స్టేషన్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తున్న ఫిర్యాదుదారుడు

ఈ క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. పోలీస్‌శాఖ సేవలను మరింత మెరుగు పరిచేందుకు, క్యూఆర్ కోడ్‌ద్వారా పోలీసుల పనితీరు, ప్రవర్తనా నియమావళిపై ప్రజల నుంచి నేరుగా తెలుసుకునేందుకు ఈనెల 9న డీజీపీ జితేందర్ ఫీడ్‌బ్యాక్ సేకరణను రాష్ట్రవ్యాప్తంగా వర్చువల్ ద్వారా ప్రారంభించారు.

ఆన్‌లైన్ ద్వారా ఫీడ్‌బ్యాక్..

ఆన్‌లైన్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పేరు, పోలీసు స్టేషన్ పరిధి, మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్, సమస్యను విన్నవించడం, పోలీసు పనితీరు ఎలా ఉందనే అంశాలను పూరించాల్సి ఉంటుంది. తర్వాత పోలీసులు తిరిగి కాల్ చేయవచ్చా.. లేదా అనే ఆప్షన్ ఉంటుంది. వివరాలను అప్‌లోడ్ చేస్తే జిల్లా ఎస్పీతో పాటు డీజీపీ కార్యాలయానికి మెస్సేజ్ వెళ్తుంది. ఈ సమాచారం ద్వారా పోలీసు స్టేషన్, అధికారుల పనితీరు తేటతెల్లం అవుతుంది. అభిప్రాయ సేకరణలో ఫిర్యాదు, ఎఫ్ఐఆర్, ఈ–చలాన్, ట్రాఫిక్ ఉల్లంఘనలు, పాస్‌పోర్టు ధ్రువీకరణ తదితర అంశాలకు సంబంధించి ఫీడ్‌బ్యాక్ ఇవ్వొచ్చు. ప్రజల నుంచి అందిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోనున్నారు. ఫీడ్‌బ్యాక్ అందించిన వారిపేర్లు గోప్యంగానే ఉంచబడుతాయి. ఈ విధానం ద్వారా సిబ్బందిలో మార్పురావడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని పోలీస్ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

దురుసుగా ప్రవర్తించే వారిలో గుబులు..

పోలీసు స్టేషన్‌లలో దురుసుగా ప్రవర్తించే పోలీసు అధికారులు, సిబ్బందిలో గుబులు రేపుతోంది. ఫిర్యాదుదారులతో కొందరు అసహనం వ్యక్తం చేయడం, బయట వెళ్లి కూర్చోమని చెప్పడం, ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం, చిన్నచిన్న దొంగతనాలైనా కేసులు నమోదు చేయకపోవడం, రాజకీయ ఒత్తిడితో కొందరు అధికారులు బాధితుల సమస్యలను పరిష్కరించని వారు క్యూఆర్ కోడ్ ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. వారి పనితీరు బయటపడనుంది. ఆన్‌లైన్ ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా పోలీసు స్టేషన్‌లకు గ్రేడింగ్ కల్పించనున్నారు.

పారదర్శకత పెంపొందించేందుకే..



కొంతమంది అధికారుల ప్రవర్తనతో పోలీస్ ప్రతిష్ట దెబ్బతింటోంది. అలాంటి వారిపై స్పెషల్ ఫోకస్ పెట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందించడం జరుగుతోంది. ఇటీవల ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన క్యూఆర్‌కోడ్ సిస్టం గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు నిర్భయంగా మీ పరిధిలో ఉన్న పోలీస్ అధికారుల తీరుపై మీ అభిప్రాయం తెలపాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దీని ద్వారా పోలీస్‌శాఖలో పారదర్శకత పెరుగుతుంది.

– ఎం.శ్రీనివాస్, రామగుండం పోలీస్ కమిషనర్

ప్రజలు అభిప్రాయం తెలియజేయవచ్చు



పోలీసుల పనితీరుపై ఆన్‌లైన్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ప్రజలు తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చు. అన్ని పోలీసు స్టేషన్‌లలోని రిసెప్షన్ సెంటర్, స్టేషన్ హౌజ్, ప్రజలు వేచి ఉండే గది, ప్రవేశ ద్వారం ఏర్పాటు చేశాం. ప్రతీ పోలీసు స్టేషన్‌లో క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచాం. సోషల్ మీడియా ద్వారా కూడా తెలియజేస్తున్నాం. తమ అభిప్రాయాన్ని సులభంగా తెలియజేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఐదు అంశాలకు సంబంధించి అభిప్రాయం ఆన్‌లైన్‌లో తెలియజేయవచ్చు.

– గౌస్ ఆలం, ఎస్పీ, ఆదిలాబాద్

ఢిల్లీకి అతిథులుగా..

- గణతంత్ర వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం
- ఉమ్మడి జిల్లా నుంచి పది మంది ఎంపిక

ఉట్నూర్‌రూరల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26న ఢిల్లీలో నిర్వహించనున్న వేడుకల్లో పాల్గొనేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి పది మందిని ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపిక చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా రంగాల్లో వారు చేసిన కృషితో పాటు రూరల్ డెవలప్‌మెంట్, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిపై హ్యాండిక్రాఫ్ట్ విభాగంలో ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని తాడిహత్నూర్‌కు చెందిన జాడే సుజాత, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని కౌఠి గ్రామానికి చెందిన ఎస్.జయంతి రాణి ఎంపికయ్యారు. రూరల్ డెవలప్‌మెంట్ విభాగం నుంచి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలోని కుకుడ గ్రామానికి చెందిన పోర్తెట్టి శ్రీదేవి, ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని గిన్నెరకు చెందిన మెస్రం లలిత ఎంపికయ్యారు. పీఎం జన్‌మన్ విభాగం నుంచి ఆదిలాబాద్ జిల్లాలోని ఖండాలకు చెందిన ఆత్రం రాంబాయి, సిడాం భీంరావు, ఉట్నూర్ మండలంలోని ధర్మాజీపేటకు చెందిన కొడప లక్ష్మీబాయి, అయ్యు, మడావి రాంబాయి, మానిక్‌రావు ఎంపికయ్యారు. ఈ నెల 26న కర్తవ్యపథలో జరిగే గణతంత్ర వేడుకలను వీక్షించేందుకు వీరంతా ఢిల్లీ వెళ్లనున్నారు.

సంతోషంగా ఉంది



నాతో పాటు మా గూడెం నుంచి మరో ముగ్గురు ఢిల్లీ రావాలని కరెంటు అధికారులు వచ్చి చెప్పారు. ఢిల్లీకి వెళ్లడం మాకు ఎంతో సంతోషంగా ఉంది. అక్కడ పెద్దపెద్ద సార్లను కలుస్తామంట. మేము వేడుకల్లో పాల్గొనడంతో పాటు మా గూడెం సమస్యలు కూడా సార్లకు విన్నవిస్తాం.

– మానిక్‌రావు, ధర్మాజీపేట, ఉట్నూర్

మరింత ఉత్సాహంతో పనిచేస్తా



కౌటాల: మండలంలోని కౌఠి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 19 ఏళ్లుగా పిల్లలకు పాఠాలు బోధిస్తున్నా. స్వయంగా పక్షులు, గృహాలు, పువ్వులు, జంతువులు, వాహనాలు, తదితర బొమ్మలను తయారు చేసి వాటి జీవన విధానాలపై చిన్నారులకు వివరిస్తున్నా. పిల్లలకు చదువుపై ఆసక్తి కల్పిస్తున్నా. విభిన్నంగా బోధన చేస్తుండడంతో పీఎం యశస్వి పథకం కింద ఎంపిక చేశారు. కేంద్ర ప్రభుత్వం నా సేవలను గుర్తించి ఢిల్లీ పరేడ్‌కు ఆహ్వానించడం సంతోషాన్నిచ్చింది. మరింత ఉత్సాహంతో పనిచేస్తా.

– ఎస్.జయంతిరాణి, కౌఠి, కౌటాల

ఆనందంగా ఉంది



బెజ్జూర్: జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా మూడేళ్లుగా పనిచేస్తున్నా. మారుమూల బెజ్జూర్ మండలానికి చెందిన నాకు ఢిల్లీ నుంచి పిలుపు రావడం సంతోషంగా ఉంది. మండలంలో 450 గ్రూపులు, 20 గ్రామ సంఘాలు ఉన్నాయి. రూ.30 నుంచి రూ.200 వరకు పొదుపు చేస్తున్నారు. ఒక్కో గ్రూప్ రూ.50వేల నుంచి రూ.15 లక్షల రుణం తీసుకునే స్థాయికి చేరుకున్నాం. ఢిల్లీలో వేడుకలకు వెళ్లడం సంతోషంగా ఉంది.

– పోర్తెట్టి శ్రీదేవి, కుకుడ, బెజ్జూర్

నాగోబా జాతర ఏర్పాట్లు ముమ్మరం



సిద్ధమైన హెలిప్యాడ్



గుంతల్లో మొరం పోయిస్తున్న అధికారులు



బ్లేడ్ ట్రాక్టర్‌తో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న దృశ్యం

ఇంద్రవెల్లి: ఈ నెల 28న నాగోబా జాతర షురూ కానుంది. ఇప్పటికే మెస్రం వంశీయుల గంగాజల సేకరణ పాదయాత్ర కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో గోవడ్, కోనేరుకు రంగులు వేయడంతో పాటు మర్రిచెట్టు, జాతర నిర్వహణ స్థలం వద్ద పిచ్చిమొక్కల తొలగించే పనులు పూర్తి చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో మెస్రం వంశీయులు బస చేయనున్న మర్రిచెట్టు తదితర ప్రాంతాల్లో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. శాశ్వతంగా నిర్మించిన మరుగుదొడ్లు, స్నానపు గదుల మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ముత్నూర్ నుంచి కేస్లాపూర్ వరకు గల రహదారికి ఇరువైపులా కోతకు గురైన ప్రాంతాల్లో మొరం పోసి బాగు చేశారు. అలాగే నాగోబా ఆలయ సమీపంలో హెలీప్యాడ్‌ను సిద్ధం చేశారు. జాతర ప్రారంభానికి వారం ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని ఆయా శాఖల అధికారులు పేర్కొంటున్నారు.

బుగ్గలో జడ్జి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జడ్జిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మాసాడి శ్రీదేవి, అర్చకులు వేణుగోపాల్ శర్మ, సతీష్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



గాయపడిన ఆటోడ్రైవర్ తిరుపతి

జన్నారం(ఖానాపూర్): ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం జన్నారం గ్రామ పంచాయతీకి చెందిన ఆటో సోమవారం జన్నారం నుంచి టీజీపల్లికి వెళ్తుండగా భారత్ గ్యాస్ కార్యాలయం సమీపంలో నిర్మల్ డిపోకు చెందిన బస్సు ఆటోను ఓవర్‌టేక్ చేయబోయి వెనుకనుంచి ఢీకొట్టింది. ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ తనుగుల తిరుపతి, ప్రయాణికులు గంగవ్వ, స్రవంతి, హర్షికకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో క్షతగాత్రులను లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

రామకృష్ణాపూర్: రవీంద్రఖని రైల్వేస్టేషన్లో సోమవారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. మృతునికి 50 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని, మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నలుగురి బైండోవర్

భీమిని: కోడిపందేలు నిర్వహిస్తూ పట్టుబడిన నలుగురు వ్యక్తులను సోమవారం డిప్యూటీ తహసీల్దార్ జోగయ్య ఎదుట బైండోవర్ చేసినట్లు కన్నెపల్లి ఎస్సై గంగారాం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గతంలో కోడిపందేలు నిర్వహిస్తూ పట్టుబడిన మహేందర్, రాజేశ్, మల్లేశ్, వెంకటేష్‌ను బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు, జూదం లాంటివి ఆడితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యక్తిపై కేసు నమోదు

కుభీర్(ముధోల్): మద్యం మత్తులో 100కు కాల్‌చేసిన వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పీ.రవీందర్ తెలిపారు. మండలంలోని మాలెగాం సమీపంలో ఆదివారం రాత్రి నలుగురు వ్యక్తులు రోడ్డుపై న్యూసెన్స్ చేస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు దీపక్, ఆత్మరాం వారిని సముదాయించి స్వగ్రామమైన సాంవ్లికి పంపించారు. అందులో రోహిత్ అనే వ్యక్తి తాగిన మైకంలో పదేపదే 100కు కాల్‌చేసి పని పేరు చెప్పకుండా విసిగించడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హత్య కేసులో ఇద్దరి రిమాండ్

ముధోల్: హత్య కేసులో ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సంజీవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముధోల్‌కు చెందిన కరుణ్ ఇటీవల హత్యకు గురికాగా అతని భార్య ఫిర్యాదు మేరకు మృతుని తండ్రి ఏఎస్సై రాందాస్, బావ కానిస్టేబుల్ అనిల్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన ఓల్లెపు సాయన్న ఈ నెల 4న పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. గత మంగళవారం నుంచి ఆచూకీ లభించకపోవడంతో అతని తండ్రి ఓల్లెపు హనుమంతు సోమవారం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 7989883565 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు

- విజేతగా నిలిచిన తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ జట్టు
- రన్నరప్‌గా నిలిచిన ఉమెన్స్ ఫుట్‌బాల్ క్లబ్ హైదరాబాద్



మొదటి బహుమతి అందుకుంటున్న స్పోర్ట్స్ స్కూల్ జట్టు

రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్–13 బాలికల ఫుట్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఖేలో ఇండియా గేమ్స్‌లో భాగంగా నిర్వహించిన చాంపియన్‌షిప్ పోటీలు లీగ్ పద్ధతిలో నిర్వహించారు. తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట్ జట్టు విజేతగా నిలువగా, ఉమెన్స్ ఫుట్‌బాల్ క్లబ్ హైదరాబాద్ జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఆతిథ్య ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు మూడో స్థానంలో నిలిచింది.

లీగ్స్‌లో సత్తాచాటిన స్పోర్ట్స్ స్కూల్ జట్టు

తెలంగాణ అండర్–13 బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ జట్టు సత్తాచాటింది. లీగ్ పద్ధతిలో నిర్వహించిన ఈ పోటీల్లో ఆడిన ఐదు లీగ్ మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది విజేతగా నిలిచింది. ఉమెన్స్ ఫుట్‌బాల్ క్లబ్ హైదరాబాద్ జట్టు నాలుగు మ్యాచ్‌లు గెలిచి ద్వితీయ బహుమతి సాధించగా.. ఆతిథ్య ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు తృతీయ బహుమతి గెలుచుకుంది. కేర్ ఫుట్‌బాల్ అకాడమీ నిజామాబాద్‌కు అలాఫ్‌ఖాన్ ట్రోఫీ, బెస్ట్ ఫెయిర్ ప్లే జట్టుగా ట్విన్ సిటీస్ హైదరాబాద్ జట్టుకు, బెస్ట్ డిసిప్లిన్ జట్టుగా గజ్వేల్ ఫుట్‌బాల్ అకాడమీ జట్టుకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో ప్రతిభను చాటిన మరికొంత మంది క్రీడాకారిణులకు బహుమతులు అందజేశారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి..

క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకుని రెండింటిని సమానంగా స్వీకరించాలని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి అన్నారు. క్రీడాస్ఫూర్తి కలిగిన క్రీడాకారులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, ప్రశాంతతకు దోహదం చేస్తాయని, చదువుతోపాటు క్రీడలకు సమప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సింగరేణి గుర్తింపు సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఏరియా ఎస్‌ఓటు జీఎం విజయ్‌ప్రసాద్, సివిల్ డీవైఎస్ఈ శ్రీధర్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, పట్టణ ఎస్సై రాజశేఖర్, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, డాక్టర్ శరత్‌బాబు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లేరాజు పాల్గొన్నారు.



ద్వితీయ బహుమతి అందుకుంటున్న ఉమెన్స్ ఫుట్‌బాల్ క్లబ్ జట్టు



తృతీయ బహుమతి అందుకుంటున్న ఆదిలాబాద్ జట్టు

కేటాయించరు.. అద్దె రాదు..!

- నిరుపయోగంగా ఎస్సీ కార్పొరేషన్ దుకాణ సముదాయం
- మరమ్మతుల్లో పీఆర్ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం


మూసి ఉన్న ఎస్సీ కార్పొరేషన్ దుకాణాలు

బెల్లంపల్లి: షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో సుమారు దశాబ్దన్నర క్రితం బెల్లంపల్లిలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఎస్సీ కార్పొరేషన్ వాణిజ్య దుకాణాల సముదాయం నిరుపయోగంగా మారింది. నిధులు మంజూరైనా మరమ్మతులు చేయించకపోవడంతో ప్రయోజనం లేకుండా పోతోంది. నిరుద్యోగులకు అద్దె ప్రాతిపదికన కేటాయించి ఎస్సీ కార్పొరేషన్‌కు ఆదాయం సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆరు దుకాణాలు నిర్మించారు. ఏడాది క్రితం వేలం నిర్వహించగా.. ఔత్సాహికులు పోటాపోటీగా వేలం పాడి దక్కించుకున్నారు. ఒక్కో దుకాణానికి కనిష్ఠంగా నెలకు రూ.6,500 నుంచి గరిష్ఠంగా రూ7,500 వరకు వేలం పాడారు. ఈ లెక్కన నెలకు సుమారు రూ.40వేల వరకు రావాల్సి ఉండగా.. మరమ్మతు చేయించకపోవడంతో ఏడాదిగా అద్దె ఆదాయం ఎస్సీ కార్పొరేషన్ కోల్పోతోంది. ప్రస్తుతం ఈ ఏరియా వ్యాపార, వాణిజ్య పరంగా వృద్ధిలోకి వచ్చింది. ముమ్మందు మరింత అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి. కానీ దుకాణాల నిర్వహణ లేకపోవడంతో అలంకార ప్రాయంగా మారాయి.

దుకాణాలు బల్దియాలో.. పీఆర్‌కు పనులు

కార్పొరేషన్‌కు చెందిన దుకాణాలు మున్సిపాల్టీ పరిధిలో ఉండగా.. మరమ్మతుల బాధ్యతను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. మరమ్మతులకు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ నుంచి ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మరమ్మతులకు రూ.5లక్షలు మంజూరైనా ఉపయోగం లేకుండా పోతోంది. పనులకు బెల్లంపల్లి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులకు ఆదేశాలు జారీ అయినా ఎన్‌వోసీ తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. అధికారుల పట్టింపులేని ధోరణితో అద్దెకు తీసుకున్న నిరుద్యోగులు దుకాణాల కోసం ఎదురు చూస్తున్నారు. మరమ్మతులు చేసి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.

నిధులు మంజూరయ్యాయి



దుకాణాల మరమ్మతుకు రూ.5లక్షలు మంజూరు అయ్యాయి. మరమ్మతుల బాధ్యతలను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులకు అప్పగించారు. పనులు ప్రారంభించడంలో కాలయాపన వాస్తవమే. మరమ్మతులు జరిగేలా చర్యలు తీసుకుని నిరుద్యోగులకు అప్పగిస్తాం. – దుర్గాప్రసాద్, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్, మంచిర్యాల

ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంది

ఎస్సీ కార్పొరేషన్ షాపులు మున్సిపాలిటీ పరిధిలో ఉన్నాయి. వీటి మరమ్మతులకు నిధులు మంజూరైనా మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్ నుంచి ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంది. త్వరలోనే ఎన్‌వోసీ తీసుకుని షాపులకు మరమ్మతులు చేయిస్తాం.

కోడిపందేల స్థావరం పై పోలీసుల దాడి

- 12మంది అరెస్టు
- రూ.43వేలు స్వాధీనం


పట్టుబడిన పందెంరాయుళ్లతో పోలీసులు

జైపూర్: మంచిర్యాల–పెద్దపల్లి జిల్లా సరిహద్దు ప్రాంతమైన కిష్టాపూర్ శివారులో కోడిపందేల స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. సంక్రాంతి పండుగ కావడంతో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలో గల ఆయా ప్రాంతాలకు చెందిన వారు కోళ్లపందేలు ఆడుతున్నారన్న సమాచారంతో మంచిర్యాల జిల్లా జైపూర్ ఎస్సై శ్రీధర్ పోలీసు సిబ్బందితో దాడి చేశారు. ముసుకుల అనిల్‌రెడ్డి, మందెల కిషోర్‌రెడ్డి, దాసరి మనోహర్, చందుపట్ల తిరుపతిరెడ్డి, చిగురు రమేశ్, భీముని కృష్ణ, కామెర అభిలాష్, చిరుగు సమ్మరాజు, వేల్పుల రాజు, మందెల రవీందర్‌రెడ్డి, ఎన్‌రెడ్డి రాజేశ్, బాలభద్ర కార్తీక్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.43,220 నగదు, రెండు కార్లు, మూడు బైక్‌లు, రెండు కోడి కత్తులు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. 12మంది పందెంరాయుళ్లను జైపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, ఎంతటివారినైనా వదిలిపెట్టే ప్రసక్తిలేదని ఎస్సై హెచ్చరించారు.

గట్టు మల్లన్న సన్నిధిలో గిరిప్రదక్షిణ


రాముని పాదుకలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలో ప్రసిద్ధిగాంచిన వేలాల గట్టు మల్లన్న స్వామి సన్నిధిలో సోమవారం మూడో గిరిప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రాన నిర్వహించే గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో భాగంగా ఉదయాన్నే సురేశ్‌ఆత్మరాం మహరాజ్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి తీసుకువచ్చిన శ్రీరాముని పాదుకలతో ఒగ్గు పూజారుల నేతృత్వంలో ఆటపాటలతో గుట్టపై ప్రదక్షిణ చేపట్టారు. ఆయా ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో గుట్టప్రాంతం భక్తజన సంద్రంగా మారింది. భక్తులు దొణలో స్వయంభూగా వెలిసిన మల్లన్న స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం మంచిర్యాల ఆర్టీసీ డిపో నుంచి వేలాలకు ప్రత్యేక బస్సును నడిపించారు. ఈ కార్యక్రమంలో గట్టు మల్లన్నస్వామి ఆలయ వ్యవస్థాపకులు బొప్పకట్ల శ్రీకాంత్, వేలాల ప్రత్యేకాధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్‌రావు, నాయకులు లక్ష్మణ్, నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

ముసాయిదా బిల్లు ప్రతులు దహనం



ప్రతులు దహనం చేస్తున్న నాయకులు

జన్నారం: జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధాన ముసాయిదా బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడ గ్రామంలో బిల్లు ప్రతులను దహనం చేశారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏ.లాల్‌కుమార్ మట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులను మోసం చేయాలని చూస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దొండ ప్రభాకర్, నాయకులు కిష్టన్న, సుమన్, మల్లేష్, రాజన్న, రామన్న, అబ్దుల్లా, చంద్రయ్య పాల్గొన్నారు.

పాఠశాల విద్య బలోపేతం చేయాలి

- ఎస్సీఎస్టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న



సమావేశంలో మాట్లాడుతున్న రాజన్న

జన్నారం: మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠశాల విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్సీ ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో 'పాఠశాల విద్య బలోపేతంలో ఉపాధ్యాయుని పాత్ర' అనే అంశం ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు క్రమంగా తగ్గుతోందని, పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రభుత్వ పాఠశాల మనుగడ, ఉపాధ్యాయుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని తెలిపారు. పాఠశాలల నిర్వహణ లోపం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో బోధన, అభ్యసన ప్రక్రియపై పర్యవేక్షణ కొరవడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బాదావత్ ప్రకాష్‌నాయక్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామటెంక శ్రీనివాస్, భూక్యా రాజన్న, జిల్లా గౌరవ అధ్యక్షుడు జాడి ప్రభాకర్, మండల అధ్యక్షుడు తుంగూరు గోపాల్, సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

'ఖోఖో'కు స్వర్ణయుగం

- జాతీయ జట్టుకు ఆడిన పలువురు కరీంనగర్ ఉమ్మడి జిల్లా క్రీడాకారులు
- తొలి ప్రపంచకప్‌కు మనదేశం ఆతిథ్యం ఇస్తున్న నేపథ్యంలో పలువురు క్రీడాకారుల అభిప్రాయాలు



ఖోఖోలో తలపడుతున్న క్రీడాకారులు (ఫైల్)


ఖోఖో వరల్డ్ కప్ ట్రోఫీ

కరీంనగర్‌స్పోర్ట్స్: ఖోఖో ప్రాచీనకాలము నుంచి ఆడుతున్న భారతీయ ఆట. ఖోఖో అను పదము 'స్యూ' అను లాటిన్ పదము నుంచి వచ్చింది. పరికరాలు లేకుండా సులభంగా ఆడుకోగల స్వాభావికమైన ఆట. ఖర్చుతో కూడిన ఆట కాదు. గ్రామీణ ప్రాంతాల్లో అందరికీ అందుబాటులో ఉండే క్రీడ. మొట్టమొదట ఖోఖోను మహారాష్ట్రలోని పూణేలో ఆడారు. 1914 నుంచి ఖోఖో టోర్నమెంట్‌లను నిర్వహించడం ప్రారంభించారు. 1925లో ఖోఖో అసోసియేషన్, 1950లో భారతీయ ఖోఖో సమాఖ్య ఏర్పడింది. ఉమ్మడి రాష్ట్రంలో 1960లో మొదట ఖోఖో జాతీయ పోటీలు విజయవాడలో నిర్వహించారు. ఈ క్రీడలో ప్రావీణ్యం పొందిన క్రీడాకారులకు అర్జున, ఏకలవ్య, రాణిరుద్రమా అవార్డులు అందజేస్తారు.

తొలి ప్రపంచకప్‌తో..

ప్రాచీన క్రీడ ఖోఖో తొలి ప్రపంచ కప్‌కు మన దేశం ఆతిథ్యం ఇస్తుంది. ఖోఖో చరిత్రలోనే జరుగనున్న ప్రపంచకప్ పోటీలతో విశ్వవ్యాప్తంగా ఈ ఆటకు స్వర్ణయుగమనే చెప్పాలి. ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో సోమవారం నుంచి ప్రారంభమైన పోటీలు ఈనెల 19 వరకు జరుగనున్నాయి. ఇటీవల జరిగిన అల్టీమేట్ ఖోఖో తో ఆదరణ పొందిన ఈ క్రీడ నేడు ప్రపంచ కప్ పోటీలతో క్రేజీ గేమ్‌గా అవతరించబోతుంది.

ఉమ్మడి జిల్లాకు ఘనమైన చరిత్ర

ప్రాచీన క్రీడ ఖోఖోలో ఉమ్మడి జిల్లాకు ఘనమైన చరిత్రే ఉంది. ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటి వరకు ఐదుగురు క్రీడాకారులు వివిధ స్థాయిల్లో భారత ఖోఖో జట్టుకు ప్రాతినిథ్యం వహించారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన గెల్లు మధుకర్‌యాదవ్ తెలంగాణ చరిత్రలోనే భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించిన రెండో క్రీడాకారుడు కాగా ఆనంద్, వెంకటేశ్, నవీన్, రాజు సైతం భారత జట్టు తరుపున పాల్గొన్నారు. అలాగే పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన పారుపెల్లి వెంకట ఉమాపతి గతంలో తెలంగాణ ఖోఖో సంఘానికి సారథిగా వ్యవహరించిన ఘనతను దక్కించుకున్నారు. కేవలం కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడం విశేషం.

ఆనందంగా ఉంది



ఖోఖో ప్రపంచకప్ పోటీలకు మనదేశం ఆతిథ్యం ఇవ్వడం ఆనందంగా ఉంది. మన జట్టు ప్రపంచంలోనే నంబర్ వన్. ఇక ఈ పోటీలతో మన దేశంలో ఖోఖో క్రీడ క్రేజీ గేమ్‌గా అవతరించబోతుంది.
– గెల్లు మధుకర్‌యాదవ్, ఖోఖో జాతీయ జట్టు మాజీ క్రీడాకారుడు, సుల్తానాబాద్

పూర్వ వైభవం



ఖోఖోకు పూర్వవైభవం రానుంది. ఢిల్లీలో ప్రపంచ కప్ పోటీలు జరగడం చాలా సంతోషకరం. గతంలో మేం ఆడిన సందర్భాల్లో ఖోఖో ప్రాచుర్యం అంతగాలేదు. కానీ ఇప్పుడు ప్రపంచకప్ పోటీలతో ఈ ఆట విశ్వవ్యాప్తం కానుంది.
– పంధగ ఆనంద్, ఖోఖో జాతీయ జట్టు మాజీ క్రీడాకారుడు, ఇల్లంతకుంట

ప్రపంచకప్ పోటీలను..



ఎన్నో సార్లు జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్నా. నేపాల్‌లో జరిగిన శాప్ గేమ్స్‌లో పాల్గొని బంగారు పతకం సాధించా. ఒక్కసారైన ఖోఖో వరల్డ్ కప్ పోటీలు జరుగాలని చూశాను. ఆ తరుణం వచ్చింది. ఖోఖో పోటీలకు మన దేశం ఆతిథ్యం ఇవ్వడం శుభ పరిణామం. చాలా హ్యాపీగా ఉంది.
– రాజు, భారత ఖోఖో జట్టు మాజీ క్రీడాకారుడు

భవిష్యత్ గేమ్ ఖోఖోదే..



ప్రస్తుతం గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో ఖోఖో పోటీలు జరిగినా తండోపతండాలుగా క్రీడాకారులు హాజరవుతున్నారు. మరే ఇతర గేమ్‌లకు రానంత ఆదరణ ఖోఖో క్రీడకు వస్తుండడం విశేషం. ఇక ఈ ప్రపంచకప్ పోటీలతో దేశంలో భవిష్యత్‌లో ఖోఖో గేమ్ దే పై చేయి కానుందనడంలో ఎలాంటి సందేహం లేదు.
– నవీన్, ఖోఖో జాతీయ జట్టు మాజీ క్రీడాకారుడు, కోరుట్ల

ఇక స్వర్ణయుగం



ఖోఖో క్రీడకు ఇక స్వర్ణయుగమనే చెప్పాలి. ఎన్నో సంవత్సరాల నుంచి వేచి చూసిన సమయం నేడు ఆసన్నమైంది. ప్రపంచకప్ పోటీలతో నేడు ఫుట్‌బాల్, క్రికెట్ లాంటి గేమ్‌ల సరసన ఖోఖో చేరడం శుభపరిణామం. ఖోఖో క్రీడాకారులందరూ పండుగ చేసుకునే రోజు.
– వెంకటేశ్, ఖోఖో జాతీయ జట్టు మాజీ క్రీడాకారుడు, గుండారం

విజేతలుగా నిలుస్తారు



ఢిల్లీలో జరుగుతున్న ప్రపంచకప్ పోటీల్లో మన జట్టుకు స్కిల్ ఎనలైజర్‌గా వ్యవహరిస్తున్నందుకు ఆనందంగా ఉంది. మహిళల జట్టు చాలా బాగుంది. పసిడి పతకం సాధిస్తారు. అలాగే పురుషుల జట్టు కూడా అద్భుతంగా ఉంది. తొలి ప్రపంచకప్ విజేతలుగా మన దేశం నిలుస్తదని ఆశిస్తున్న. నెల రోజుల పాటు ఢిల్లీలో మన జట్లకు అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ ఇచ్చాం.
– ఇ.నరేశ్, ఖోఖో మహిళల జాతీయ జట్టు స్కిల్ ఎనలైజర్, బంజరుపల్లితండా (ధర్మారం)

ప్రయోగం.. అవగాహన.. ఫలితం

- వర్మి కంపోస్టు తయారీలో 'పొలాస' విద్యార్థులు
- కిలో ఎరువు రూ.8 నుంచి రూ.10 వరకు..
- నేరుగా అన్నదాతలకే విక్రయం


వర్మి కంపోస్టు తయారు చేస్తున్న వ్యవసాయ విద్యార్థులు

జగిత్యాలఅగ్రికల్చర్: ఇటీవల కాలంలో రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువయిన వర్మి కంపోస్టును ఉపయోగించి అన్ని పంటల్లో అధిక దిగుబడులు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో పొలాస వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థుల బృందం తమ ప్రాజెక్టులో భాగంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంపత్ ఆధ్వర్యంలో పొలాస వర్మి బ్రాండ్‌తో వర్మి కంపోస్టును తయారు చేసి డిమాండ్‌ను బట్టి కిలో రూ.8–10 చొప్పున రైతులకు దళారుల ప్రమేయం లేకుండా నేరుగా విక్రయిస్తున్నారు. ఇప్పటివరకు 2 టన్నుల వరకు విక్రయించగా.. రూ.20వేల వరకు సంపాదించారు.

ఎలా తయారు చేశారంటే..

ముందుగా భూమికి సమానంగా 50 అడుగుల పొడవు, 3 అడుగుల వెడల్పు, ఒక అడుగు లోతు ఉండేలా బెడ్లు తయారు చేశారు. బెడ్లపై దాదాపు 45 సెం.మీ. ఎత్తు వరకు కుళ్లుతున్న వ్యర్థ పదార్థాలను వేసి, వాటిపై 5 నుంచి 10 సెం.మీ. మందం వరకు పేడను వేశారు. వ్యర్థ పదార్థాలు, పేడను వేసేటప్పుడు బెడ్‌పైన నీటితో తడిపారు. ఎప్పుడు బెడ్ మీద 50–60 శాతం తేమ ఉండేలా చూసుకున్నారు. ప్రతిరోజు తేమ ఉండేలా విద్యార్థులు బ్యాచ్‌లవారీగా నీటిని చల్లుతారు. వారం తర్వాత బెడ్‌పై వానపాములను ప్రతి చ.మీ.కు వెయ్యి చొప్పున వానపాములను వదిలారు. దీంతో వానపాములు ఆహారం, తేమను వెతుక్కుంటూ లోపలికి వెళ్లాయి. బెడ్‌పై పాత గోనె సంచులు, వరి గడ్డని పరిచారు. దీనివల్ల తేమ నిల్వ ఉండటమే కాకుండా వానపాములకు పక్షులు, చీమల నుంచి రక్షణ ఉంటుంది. 2, 3 నెలల్లోనే వర్మి కంపోస్టు తయారైంది. తయారైన కంపోస్టు నల్లగా, తేలికగా ఉంటుంది. ఎరువు తయారైన తర్వాత వానపాములు అందులో ఉండక పైన కప్పిన గోనె సంచులకు అతుక్కుపోతాయి. వెంటనే వానపాములను మరో బెడ్ మీదకు మార్చుతున్నారు.

పొలాస వర్మి బ్రాండ్‌తో..

విద్యార్థులు తయారు చేసిన వర్మి కంపోస్టును విక్రయించేందుకు కళాశాలలో ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పొలాస వర్మి బ్రాండ్‌తో ప్రచారం చేసి విక్రయిస్తుండటంతో పెరటి తోటలు వేసే రైతులు, ఇళ్లలో కూరగాయలు పెంచే రైతులు ఎక్కువగా తీసుకెళ్తున్నారు. వర్మి కంపోస్టులో 1.6 శాతం నత్రజని, 0.5 శాతం భాస్వరం, 0.8 శాతం పోటాష్ ఉంటాయి. మొక్కలకు కావాల్సిన అన్ని పోషకాలను ఈ కంపోస్టు అందిస్తుంది.

బ్రాండ్‌తో విక్రయం



పొలాస వర్మి బ్రాండ్‌తో వర్మి కంపోస్టును విక్రయిస్తున్నాం. ఒక్కసారి వాడండంటూ విస్తృత ప్రచారం చేస్తున్నాం. రైతుల నుంచి మంచి స్పందన వస్తోంది. 2 టన్నుల మేర అమ్మాం.
– ధనుంజయ్, వ్యవసాయ విద్యార్థి

నాణ్యమైన కంపోస్టు



కంపెనీల మాదిరిగా మట్టి పెళ్లలు కలపకుండా స్వయంగా తయారు చేసిన వర్మి కంపోస్టును రైతులకు నేరుగా విక్రయిస్తున్నాం. కూరగాయలు సాగు చేసే రైతులు వాడితే వినియోగదారులకు లాభం చేసినవారవుతారు.
– హిందుప్రియ, వ్యవసాయ విద్యార్థిని

రైతుల శ్రమ తెలుస్తుంది



రైతుల శ్రమ తెలియజేసేందుకు వ్యవసాయ విద్యార్థులకు వివిధ ప్రాజెక్టులు అప్పగించాం. ఆ ప్రాజెక్టు పనులను విద్యార్థులు స్వయంగా చేయడంతోపాటు ఆ ప్రాజెక్టు ద్వారా ఆదాయాన్ని సైతం చూపాల్సి ఉంటుంది.
– డాక్టర్ భారతీ నారాయణ్ భట్, అసోసియేట్ డీన్, వ్యవసాయ కళాశాల, పొలాస

మార్కెటింగ్ ఎలా చేయాలో తెలుస్తుంది

వర్మి కంపోస్టు తయారు చేయడమే కాకుండా ఆ కంపోస్టును ఎలా అమ్మాలో విద్యార్థులకు తెలియజేసేందుకే ఈ ప్రాజెక్టును చేపట్టాం. దీనివల్ల విద్యార్థులకు తయారీ విధానంతోపాటు మార్కెట్‌పై అవగాహన పెరుగుతుంది.
– డాక్టర్ సంపత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ అండ్ గైడ్

రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రణాళిక

- నిత్యాన్నదానానికి మా కుటుంబం నుంచి రూ.40లక్షల విరాళం
- మంత్రి పొన్నం ప్రభాకర్
- రూ.10లక్షలు ప్రకటించిన విప్ 'ఆది'


కోడెమొక్కు చెల్లించుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్

వేములవాడ: వేములవాడ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే పలు కార్యక్రమాలు ప్రారంభించారని, త్వరలోనే ప్రణాళికాబద్ధంగా రాజన్న ఆలయం, పట్టణాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళ్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి సోమవారం రాజన్నను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం నిత్యాన్నదాన సత్రం ఏర్పాటుకు ముఖ్య మంత్రి రూ.35కోట్లు మంజూరు చేస్తూ జీవో విడుదల చేసినట్లు తెలిపారు. అన్నదానసత్రం కోసం తమ కుటుంబ సభ్యుల నుంచి రూ.40లక్షలు విరాళం ఇస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. రైతులు బియ్యం, కూరగాయలు కూడా ఇవ్వొచ్చన్నారు. వీఐపీ ప్రొటోకాల్ దర్శనం చేసుకునే వారు తప్పకుండా టికెట్ తీసుకోవాలని కోరారు. దీంతో బ్రేక్ దర్శనం ఆలస్యం లేకుండా త్వరగా జరుగుతుందన్నారు. అలాగే తన తల్లిదండ్రులు, కొడుకు పేరున రూ.10లక్షలు అన్నదానసత్రానికి విరాళం ఇస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రకటించారు. హైదరాబాద్ భక్తులకు కారిడార్‌గా వేములవాడ, కొండగట్టు, ధర్మపురి క్షేత్రాలను కలుపుతూ బస్సులు నడిపించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ధర్మపురి నుంచి ఏసీ బస్సు నడుస్తుందని, త్వరలోనే వేములవాడ నుంచి హైదరాబాద్‌కు ఏసీ బస్సు ప్రారంభిస్తామని తెలిపారు.